జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 141 04-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06








# డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్


- సదస్సులో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడికి ఆహ్వానం
- సానుకూలంగా స్పందించిన మషాటిలే
- భారత్, దక్షిణాఫ్రికాల మధ్య చారిత్రక బంధం ఉందని వ్యాఖ్య



హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026 కార్యక్రమాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనాలంటూ దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు ఆ దేశ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే సానుకూలంగా స్పందించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో పాల్ మషాటిలే నేతృత్వంలోని దక్షిణాఫ్రికా ప్రతినిధుల బృందంతో సీఎం సమావేశమయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య పర్యాటకం, పరిశ్రమలు, పెట్టుబడుల విషయంలో పరస్పర సహకారంపై చర్చించారు.

## కోటి మందితో

# యోగాంధ్ర-2026



- జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో

# కేంద్రంపై పోరుకు ఉమ్మడి కార్యాచరణ




- 8న ఇండియా కూటమి పక్షాల భేటీ
- 15 విపక్ష పార్టీలు హాజరయ్యే అవకాశం
- తొలిసారిగా టీవీకే పార్టీకి ఆహ్వానం


2లో

న్యూఢిల్లీ: ఇటీవల వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, కూటమిలో నెలకొన్న అభిప్రాయ భేదాల నేపథ్యంలో మరోమరు విపక్షాల ఐక్యత చాటేందుకు, కేంద్ర ప్రభుత్వంపై పోరుకు ఉమ్మడి కార్యాచరణ ప్రకటించేందుకు విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీలు 8వ తేదీన హస్తినలో భేటీకానున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా తృణముల్ అధినేత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ

## రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

చాలా ప్రాంతాల్లో తేలికపాటి, కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు

చురుకుగా నైరుతి రుతుపవనాలు... నేడు కేరళను తాకే అవకాశం





## సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారేమో కానీ...!

- కులాలపై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు..
- సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారు కానీ ఆయా కులాల ప్రజలు నష్టపోయారన్న పవన్
- గత వైసీపీ పాలనలో కుల దూషణలు, రాజకీయాలు పరాకాష్ఠకు చేరాయని విమర్శలు
- డాక్టర్ సుధాకర్, దళిత యువకుడి హత్య వంటి ఘటనలను ప్రస్తావించిన జనసేనాని
- కులాల ఐక్యతే తమ సిద్ధాంతమని, దీనికి చరమగీతం పాడతామని స్పష్టీకరణ



## సీబీఐతో విచారించాలి

- పరీక్ష నిర్వహణ, ఎంపికలో అంతులేని అక్రమాలు కనిపిస్తున్నాయి
- ఇష్టారాజ్యంగా జీవోలతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చేశారు
- దీనివల్ల అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగింది
- పార్టీ నుంచి లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేసి వారి తరఫున న్యాయ పోరాటం చేస్తాం

2లో

# ఢిల్లీలో ఘోరం



- ఇరుకైన హోటల్‌లో భారీ అగ్ని ప్రమాదం
- 11 మంది విదేశీయులుసహా 21 మంది సజీవదహనం
- పలువురికి గాయాలు
- 35 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు
- శిథిలంగా మారిన ఐదంతస్తుల భవంతి
- ప్రాణాలను కాపాడుకునేందుకు చిన్నారితో మూడో అంతస్తు నుంచి దూకిన మహిళ
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని

2లో



# అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

- రష్యా 'ఎలిమెంట్ గ్రూప్'కు నారా లోకేష్ ఆఫర్
- రష్యా సెమీకండక్టర్ దిగ్గజం ఎలిమెంట్ గ్రూప్‌తో మంత్రి లోకేష్ భేటీ
- విశాఖ, నెల్లూరు, శ్రీసిటీలలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- సెమీకండక్టర్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన ఎలిమెంట్ గ్రూప్
- అంతర్గత చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటన

## దేశభక్తి గురించి పవన్‌కల్యాణ్ దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఫాలింగ్ జరుగుతోంది
- మోదీ-- రేవంత్ భాగస్వామ్య ప్రభుత్వం
- రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పని చేస్తోంది
- మొదటి అర్ధభాగం అట్టర్ ఫ్లాప్.. మిగతా అర్ధభాగం మరింత అధ్వానం
- 2027లో పాదయాత్ర చేద్దామనే ఆలోచనలో ఉన్నట్లు కేటీఆర్ వెల్లడి

ఆయన సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం.. పెత్తనం చేస్తామంటే ఒప్పుకోం

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# కోటి మందితో యోగాంధ్ర-2026

(మొదటి పేజీ తరువాయి)

జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు.

## కేంద్రంపై పోరుకు ఉమ్మడి కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ తేజస్వీ యాదవ్, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సహా మొత్తం 15 పార్టీల అగ్రనేతలు ఈ సమావేశానికి హాజరయ్యే అవకాశాలున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం, ప్రతిపక్ష ఐక్యతను మరింత బలోపేతం చేయడం భేటీ ప్రధాన లక్ష్యాలుగా తెలుస్తోంది. ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, నిరుద్యోగం, ప్రతిష్టాత్మక పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, అంతర్జాతీయ పరిస్థితులు వంటి ప్రజా సమస్యలపై సంయుక్త పోరాటానికి భేటీలో వ్యూహాలు ఖరారు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతర పరిణామాలు, వివిధ రాష్ట్రాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగే అవకాశముంది. అయితే 'ఇండియా' కూటమిలోని కొన్ని పార్టీల మధ్య ఇటీవల అభిప్రాయ భేదాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా రానున్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు వార్తలు రావడం కూటమిలో గందరోగళం నెలకొంది. 'ఇండియా' కూటమితో తెగదెంపులు చేసుకున్న ఆప్ పార్టీ ప్రతి పక్షాల కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. తమిళనాడు ఎన్నికల అనంతరం పరిణాల నేపథ్యంలో కాంగ్రెస్‌తో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు డీఎంకే ప్రకటించింది. తమిళనాడులో కాంగ్రెస్‌తో పొత్తు తెగిపోయిన నేపథ్యంలో లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలకు దూరంగా కూర్చోవాలని డీఎంకే నిర్ణయించింది. డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి కొద్ది రోజుల కిందటే లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాసి తమ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో డీఎంకే సమావేశానికి దూరంగా ఉండే అవకాశమున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలో డీఎంకే స్థానంలో విజయ్ జోసెఫ్ సారథ్యంలోని టీవీకే పార్టీకి ప్రాధాన్యం లభించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

## సీబీఐతో విచారించాలి

అమరావతి: ఒక పోస్టుకు ఒక్కరు (1:1) నిష్పత్తిలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచి అన్నింటా సక్సెస్ అయిన అనేక మంది డీఎస్సీ 2025 అభ్యర్థులకు ఉద్యోగాలు రాకపోవడం అత్యంత హేయం.. ఇంతకంటే దారుణం మరొకటి ఉండదని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. పరీక్ష నిర్వహణ, ఎంపికలో అంతులేని అక్రమాలు చోటు చేసుకున్నట్లు అభ్యర్థులు చెబుతున్న విషయాలను బట్టి తెలుస్తోందని, అందుకే డీఎస్సీ 2025పై సీబీఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన డీఎస్సీ 2025 అభ్యర్థులు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. పరీక్ష నిర్వహణ, ఎంపికలో చోటు చేసుకున్న అక్రమాలను వైఎస్ జగన్ దృష్టికి తెచ్చి తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన, బాధలను సావధానంగా విన్న వైఎస్ జగన్ వారికి న్యాయం జరిగేలా పోరాడతామని భరోసా ఇచ్చారు.

## అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

ఆంధ్రప్రదేశ్‌ను హై-టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, మాస్కోలో రష్యాకు చెందిన ప్రముఖ సెమీకండక్టర్ల తయారీ సంస్థ 'ఎలిమెంట్ గ్రూప్' ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సమావేశంలో ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్, ఇతర డైరెక్టర్లతో భేటీ అయిన మంత్రి లోకేష్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తయారీ, డిజైన్ యూనిట్లను స్థాపించాలని ఆహ్వానించారు. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ రవాణా, బ్యాంకింగ్ వ్యవస్థలకు అవసరమైన ఆర్‌ఎఫ్ఐడీ ట్యాగ్‌లు, స్మార్ట్ కార్డ్ మైక్రోచిప్‌ల తయారీ కోసం విశాఖపట్నంలో ఒక ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, దేశీయంగా పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), సోలార్ కన్వర్టర్ల మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని నెల్లూరులో సెమీకండక్టర్ పరికరాల తయారీ యూనిట్‌ను స్థాపించాలని ప్రతిపాదించారు. ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆటోమోటివ్, అసెంబ్లింగ్ పరిశ్రమలకు రోబోటిక్స్, ఆటోమేషన్ సేవలు అందించేందుకు ఎలిమెంట్ గ్రూప్ తమ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని లోకేష్ సూచించారు. దీనికి తోడు, కమ్యూనికేషన్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమైన మాడ్యులర్ కాంపోనెంట్లపై దృష్టి సారిస్తూ వైజాగ్ హై-టెక్ కారిడార్‌లో ఒక మైక్రోఎలక్ట్రానిక్స్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణంలో భాగంగా హార్డ్‌వేర్, ఐఓటీ మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వాములు కావాలని, ఇందుకు అవసరమైన మైక్రోకంట్రోలర్లు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సరఫరా చేయాలని కోరారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని, ఇప్పటికే భారత టెక్ సంస్థలతో కలిసి సెమీకండక్టర్ పంపిణీ నెట్‌వర్క్‌లను నడుపుతున్నట్లు వివరించారు. దక్షిణాసియా మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు.

# ఢిల్లీలో ఘోరం



న్యూఢిల్లీ: నిబంధనలకు పూర్తి విరుద్ధంగా నడుస్తూ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఢిల్లీలోని ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీ హోటల్ బుధవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో మసిబొగ్గులా మారింది. తమ బంధువుల శస్త్రచికిత్సలు, వైద్యం కోసం విదేశాల నుంచి వచ్చి ఆస్పత్రి సమీప ఈ హోటల్‌లో బసచేస్తున్న పలువురు విదేశీయులు ఈ అగ్ని ప్రమాదంలో కాలిబూడిదయ్యారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు జరిగిన ఈ భారీ అగ్ని ప్రమాదంలో 11 మంది విదేశీయులు సహా మొత్తంగా 21 మంది సజీవదహనమయ్యారు. మృతుల్లో 9 మంది ఆఫ్రికా దేశస్తులుకాగా ఇద్దరు తుర్క్‌మెనిస్తాన్ దేశస్తులు. పది మంది భారతీయులూ ఈ ఘటనలో చనిపోయారు. ఉదయంకావడంతో కొందరు నిద్రలోనే శాశ్వతనిద్రలోకి వెళ్లిపోయారు. అగ్ని ప్రమాదం విషయం తెల్సి అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని 35 మందిని కాపాడారు. వీరిలో 16 మందికి స్వల్ప గాయాలుకాగా 19 మంది తీవ్రగాయాలతో ఆస్పత్రుల్లో ఐసీయూలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. హోటల్‌లోని అతిథులు, పోలీసులు, స్థానికులు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు కలిపి మొత్తంగా 58 మంది ఈ ఘటనలో ప్రభావితమయ్యారు. ఘోర అగ్నిప్రమాదం వార్త తెలిసి ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఘటనపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. సెన్సర్‌తో పనిచేసే తలుపులు మూసుకుపోయి బయటకురాలేక, అగ్నికీలల వేడిమికి తాళలేక హోటల్‌లోని అతిథులు కాపాడండి అంటూ చేసిన ఆక్రందనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని పోలీసులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్వహిస్తూ ఈ ఘటనలో పలువురి మృతికి కారణమయ్యాడంటూ హోటల్ యజమాని లోకేశ్ బజాజ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. పరారీలో ఉన్న అతన్ని పోలీసులు రాత్రి పొద్దుపోయాక అరెస్టు చేశారు. ప్రమాదం వార్త తెలిసి రాష్ట్రపతి ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల బంధువులకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. క్షతగాత్రులకు తలో రూ.50,000 మంజూరుచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ సైతం మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లోని హౌజ్‌రాణి ప్రాంతంలో ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీ హోటల్ ఒక ఐదంతస్తుల భవంతిలో నడుస్తోంది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకంలో భాగంగా ఈ నివాస భవంతిని పేయింగ్ గెస్ట్ మాదిరిగా నడుపుతున్నారు. ఈ హోటల్‌లో కేవలం ఆరు గదులకు అనుమతి ఇవ్వగా నిబంధనలకు విరుద్ధంగా 25 గదుల్లో విదేశీయులకు వసతి కల్పించారు. లైబీరియా, మొజాంబిక్, నైజీరియా, బంగ్లాదేశ్‌లకు చెందిన వ్యక్తులు ఈ హోటల్ గదుల్లో దిగారు. కిక్కిరిసిన హోటల్‌లో బుధవారం ఉదయం 8.30 గంటలకు ఉదయం హోటల్ కిచెన్‌లో చెఫ్ ఒక ఎలక్ట్రిక్ వస్తువును స్విచ్ఛాఫ్ చేశాక ఎలక్ట్రిక్ ప్లగ్ నుంచి మంటలొచ్చాయి. ఆర్పేలోపే గది అంతా మంటలు వ్యాపించి చివరకు భవనాన్ని అగ్నికీలలు చుట్టుముట్టాయని స్థానికుడు ఆసిఫ్ వెల్లడించాడు. క్షణాల్లో భవనం మొత్తాన్నీ అగ్నికీలలు చుట్టుముట్టాయి. సీల్ వేసిన కిటికీలు, ప్రతి అంతస్తులో సెన్సార్‌తో పనిచేసే తలుపులు అగ్నికీలల ధాటికి తెరుచుకోకపోవడంతో హోటల్‌లోని వాళ్లు తప్పించుకునేందుకు అవకాశం లేకుండాపోయింది.

## రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. బుధవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.5 నుంచి 1డిగ్రీ సెల్సియస్ మేర తక్కువగా నమోదయ్యాయి. మారిన వాతావరణ పరిస్థితులతో ఉష్ణోగ్రతల్లో తగ్గుదల కనిపిస్తోందని, రానున్న నాలుగు రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. గత కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో ఉడికిన రాష్ట్ర ప్రజలకు ఐఎండీ తాజా సూచన కాస్త ఉపశమనం ఇచ్చినట్లైంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తర తమిళనాడు వరకు మధ్యప్రదేశ్, విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు, కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వివరించింది.నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. గురువారం కేరళ రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నట్లు వివరించింది.

## డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 2025'భారీ విజయాన్ని సాధించిందని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనడంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయని సీఎం గుర్తు చేశారు. ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ వంటి రంగాలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే విధంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. ఫారరీచ్యన్ 500 కంపెనీలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీలు) హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో మధ్యప్రాచ్య, ఇతర అనేక దేశాల నుంచి వైద్యం కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని రేవంత్ తెలిపారు. నగరాన్ని ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో 30 వేల ఎకరాల్లో పర్యావరణ హితంగా, నెట్ జీరో టెక్నాలజీతో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. భవిష్యత్ పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పరిశోధనలకు ఇది కేంద్రంగా మారుతుందని వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ కలిగిన రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల పరిస్థితులున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చెప్పారు. బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. వచ్చే డిసెంబర్‌లో జరిగే సమ్మిట్--2026కు తమ దేశ ప్రతినిధుల బృందంతో కలిసి పాల్గొంటామని మషాటిలే తెలిపారు.

## సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారేమో కానీ...!

రాష్ట్రంలో కుల సంఘాలు ఏర్పాటు చేసుకుని వాటి నాయకులు బాగుపడ్డారేమో కానీ, ఆయా కులాల ప్రజలు మాత్రం అభివృద్ధికి నోచుకోకుండా తీవ్రంగా నష్టపోతున్నారని జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కులాల పేరుతో జరుగుతున్న రాజకీయాలకు చరమగీతం పాడాలని, కులాల ఐక్యతే తమ పార్టీ మూల సిద్ధాంతమని స్పష్టం చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పవన్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు వంటి మహనీయుడిని సైతం ఒక కులానికే పరిమితం చేసే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు, కుల దూషణలు పరాకాష్టకు చేరాయని పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. 1998 నుంచి మొదలైన ఈ ధోరణి, వైసీపీ పాలనలో జర్నలిస్టులను సైతం కులం పేరుతో దూషించే స్థాయికి దిగజారిందని విమర్శించారు. ఒక ఎమ్మెల్సీ, దళిత యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేస్తే, అధికార పార్టీ నేతలు హంతకుడిని వెనకేసుకొచ్చారని, అప్పుడు దళిత సంఘాలు సైతం మాట్లాడలేని పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. అలాగే కరోనా సమయంలో డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి, ఆయన మరణానికి కారణమైనా ఏ సంఘాలు నోరు మెదపలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కుల సంఘాలు మౌనంగా ఉండిపోవడం వల్లే నాయకులు బాగుపడుతున్నారని, ప్రజలు మాత్రం నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. కుల నిర్మూలన అనే అంబేద్కర్ ఆశయం సాధ్యమో కాదో తెలియదు కానీ, కులాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం నేటి సమాజానికి అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ సమస్యతో బాధపడుతుంటే, వాటిని పక్కనపెట్టి కేవలం కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ కుల రాజకీయాలకు ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని తమ పార్టీ నిర్ణయించుకుందని పవన్ కల్యాణ్ తెలిపారు.



## దేశభక్తి గురించి పవన్‌కల్యాణ్ దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు

హైదరాబాద్: 'తెలంగాణ రాష్ట్రానికి దశాబ్దాల తరబడి మొదటి శత్రువు కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ కథలో నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీ. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన, తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి ప్రజలపై రుద్దింది. కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు మళ్లీ ముప్పు వచ్చింది. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తూ రాష్ట్రాన్ని తిరిగి తిరోగమనంలోకి నెడుతోంది. మోదీ--రేవంత్ భాగస్వామ్య ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తోంది. మోదీ తానా అంటే కాంగ్రెస్ తందానా అంటోంది. పైన మోదీ ప్రభుత్వం ఇక్కడ జోడీ ప్రభుత్వం సాగుతోంది. మొదటి అర్ధభాగం ఇప్పటికే అట్టర్ ఫ్లాప్ అయింది. రేవంత్ పాలనలో ట్రైలర్ కాదు, ఇంటర్వెల్ కూడా పూర్తయింది. మిగతా అర్ధభాగం మరింత అధ్వానంగా ఉంటుంది. ఆయన తెలంగాణను పాతాళంలోకి తొక్కుతున్నారు. మరో 20 ఏళ్ల పాటు అధికారంలోకి రాకుండా కాంగ్రెస్ పార్టీని రేవంత్ బొంద పెడతారు..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా రవికాంత్‌రెడ్డి వ్యవహరించగా.. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్‌రెడ్డి, వరికుప్పల రమేష్ పాల్గొన్నారు. ముఖ్యాంశాలు కేటీఆర్ మాటల్లోనే.. తెలంగాణ రైజింగ్ నినాదం పేరుతో ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఫాలింగ్ జరుగుతోంది. పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన పురోగతి ప్రస్తుతం క్షీణించింది. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి చేశామని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు కాంగ్రెస్ హామీలతో మోసపోయారు. రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌ను బలహీనపరిచే కుట్ర జరుగుతోంది. ఉచిత విద్యుత్ రైతన్నలకు ఇవ్వకూడదు అన్నదే రేవంత్‌రెడ్డి సిద్ధాంతం. లేని అప్పులను ఉన్నదిగా చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆర్‌బీఐ తన నివేదికతో చెంపదెబ్బ కొట్టింది.

### తెలంగాణాకు అసలైన 'ఓజీ' కేసీఆర్

మాకు పొలిటికల్ గేర్ ఎప్పుడు మార్చాలో తెలుసు. ప్రస్తుతం ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు 90కి పైగా అసెంబ్లీ స్థానాలు వస్తాయి. వచ్చే ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ఓడిపోతారు. దమ్ముంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రేవంత్ ఉప ఎన్నికలకు రావాలి. 2027లో పాదయాత్ర చేద్దామనే ఆలోచనలో ఉన్నా. బీజేపీతో పొత్తు ఉంటుందన్నది పూర్తిగా ఊహాజనిత ప్రచారం. బీఆర్ఎస్‌కు కేసీఆర్ ట్రంప్ కార్డు. ఆయన నాయకత్వంలో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుంది. తెలంగాణకు అసలైన 'ఓజీ' కేసీఆర్. ఆయనే తెలంగాణను కాపాడుకుంటారు. తెలంగాణ ఖచ్చితంగా నాలుగు కోట్ల మంది తెలంగాణ భూమి పుత్రుల జాగీరు అనడంలో ఎవరికీ అనుమానం అక్కర్లేదు. ఈ నేల.. పోరాటాలు, త్యాగాలు చేసిన వారి నెత్తురుతో తడిచింది. మీరు వచ్చి మీ కుటుంబాలతో ఉండండి. మీ భూములు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. గడిచిన దశాబ్దానికి పైగా కాలంలో ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ఉగ్రవాదం కంటే ప్రాంతీయ వాదం ప్రమాదం అని ఏపీ డిప్యూటీ సీఎం అంటున్నాడు. గతంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర విడిపోయేందుకు నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములుది కూడా ప్రాంతీయవాదమేనా? ప్రధాని మోదీ ఆయన సొంత రాష్ట్రం గుజరాత్ మీద ఉన్న అభిమానంతో తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తీసుకెళ్తున్నారు.



# దూదివెంకటాపురంలో సి సి రోడ్డు పనులకు శ్రీకారం

- గ్రామ వికాసమే ధ్యేయం: సర్పంచ్ నడిమింటి నరేష్
- రూపురేఖలు మారనున్న 5వ వార్డు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని దూదివెంకటాపురం గ్రామ పురోభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆ గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్ పేర్కొన్నారు. బుధవారం గ్రామంలోని ఐదో వార్డులో నూతనంగా మంజూరైన సి సి (సిమెంట్ కాంక్రీట్) రహదారి నిర్మాణ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ... గ్రామంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే తమ పాలకవర్గ ముఖ్య ఉద్దేశమన్నారు. వర్షాకాలం వస్తోన్న నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా ఐదో వార్డు నివాసితులకు బురద నీటి తారుమారు నుంచి విముక్తి కల్పించేందుకు ఈ రహదారి నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా, గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, పనుల కాంట్రాక్టర్ గొడిశెల నగేష్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# టీయూజేఏసీ మండల అధ్యక్షుడిగా ప్రమోద్ సింగ్



- రాజపేట నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- మహిళా అధ్యక్షురాలిగా బాలలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి



**తొలివెలుగు, రాజపేట:** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీయూజేఏసీ) రాజపేట మండల మహాసభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూజేఏసీ మండల అధ్యక్షుడిగా ఠాకూర్ ప్రమోద్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎడ్ల బాలలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శులుగా మారోజు కుమారస్వామి, రామిండ్ల నరేందర్, ఆడెపు రమాదేవిలను ఎన్నుకున్నారు. నూతన కోశాధికారిగా బిల్ల శీను, ఉపాధ్యక్షుడిగా చింతల దాసు, కార్యదర్శిగా ఎడ్ల సత్తిరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా కొన్నే శివశంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల సాధనకై సమిష్టిగా కృషి చేస్తామని, అందరినీ కలుపుకొని సంఘ బలోపేతానికి పాటుపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణి, జిల్లా అధ్యక్షులు గాజుల యాదగిరి, జిల్లా బీజేపీ అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్, ప్రముఖ నాయకులు బాల్ రెడ్డి, బోళ్ల రాఘవ రెడ్డి హాజరై నూతన కమిటీని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, నరసింహులు, రామిళ్ళ సుధాకర్ రెడ్డి, చంద్రమౌళి, సుగుణమ్మ, అనిత, విజయ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి





- వాసవి రైస్ మిల్లును తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఏ రోజు వచ్చిన లారీలు ఆ రోజే ఖాళీ చేయాలి
- రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు

**తొలివెలుగు, వలిగొండ:** జిల్లాలో ధాన్యం కొనుగోలుతో పాటు మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ (దిగుమతి) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను, మిల్లు యజమానులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని నాగారం గ్రామంలో ఉన్న వాసవి రైస్ మిల్లును ఆయన రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లు ఆవరణలో ధాన్యం లోడుతో ఉన్న లారీల వివరాలను, నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**వాహనాలు నిలిస్తే కుదరదు:**

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మిల్లుకు ధాన్యం లోడుతో రోజుకు ఎన్ని లారీలు వస్తున్నాయి? ఒక్కో లారీ అన్‌లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతోంది? అనే అంశాలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే లారీలు మిల్లుల వద్ద గంటల తరబడి వేచి ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఏ రోజు వచ్చిన లారీలను ఆ రోజే అన్‌లోడ్ చేసి వెంటనే వెనక్కి పంపాలన్నారు. మిల్లుల్లో హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకొని దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి (డీఎస్ఓ) రోజారాణి, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల సాకారం

- సొంత ఇంటి కల నెరవేరిన వేళ లబ్ధిదారుల ఆనందం
- పాల్గొన్న మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ పూస బాలమణి బాల నరసింహ
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో లబ్ధి

**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల గృహప్రవేశ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ప్రత్యేక చొరవ, సహకారంతో గ్రామానికి చెందిన గొంగిడి రమ్య – నవీన్ కుమార్ దంపతులు నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ పూస బాలమణి బాల నరసింహ హాజరై రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూస బాలమణి బాల నరసింహ మాట్లాడుతూ.. పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. లబ్ధిదారులైన రమ్య, నవీన్ కుమార్‌ల సొంత ఇంటి కల నెరవేరడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ పథకం ఇంద్రపాలనగర గ్రామ వికాసానికి మరో ముందడుగుగా నిలిచిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలనను అందిస్తోందని గ్రామస్థులు కొనియాడారు. ఈ వేడుకలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగొని వెంకటేశం, వార్డు సభ్యులు కంబాలపల్లి సత్తయ్య, కప్పల రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గర్దాస్ రాగోలు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సాయం అందజేత



**తొలివెలుగు, రాజాపేట:** మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కల్లెం బిక్షపతి ఆకస్మిక మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, ఇంజ నర్సయ్య ఫౌండేషన్ చైర్మన్ ఇంజ నరేష్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన కాల్వపల్లి గ్రామంలోని మృతుడి నివాసానికి చేరుకుని, బిక్షపతి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబానికి ఇంజ నర్సయ్య ఫౌండేషన్ తరపున రూ. 5,000 తక్షణ ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నాయకుడు ఇంజ నరేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన బిక్షపతి మృతి తీరని లోటని, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాల్వపల్లి సర్పంచ్ ఇంజ లక్ష్మి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ప్రతినిధులు, స్థానిక గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వడదెబ్బతో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామచంద్రయ్య కన్నుమూత



- తీవ్ర ఎండల ప్రభావంతో క్షీణించిన ఆరోగ్యం
- రాజాపేటలో అంత్యక్రియలు.. సీనియర్ సిటిజన్ ఫోరం సంతాపం

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కాసోజు రామచంద్రయ్య (82) బుధవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా వృద్ధాప్య సమస్యలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. ప్రస్తుతం ఉన్న తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బకు గురయ్యారు. దీంతో ఆరోగ్యం మరింత క్షీణించి బుధవారం ఆయన తుదిశ్వాస విడిచారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన రామచంద్రయ్య మృతి పట్ల రాజాపేట మండలంలో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం మండల శాఖ అధ్యక్షుడు బల్ల దామోదర్, సంఘ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

# సర్కారు బడి.. చదువ్వుల బడి!

- రఘునాథపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ఘనత
- బాసర ట్రిపుల్ ఐటీకి ఐదుగురు ఎంపిక
- మెరిసిన ప్రతిభ.. టాపర్లను సత్కరించిన హెచ్‌ఎం మనోజ్



**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందితే విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా రాణించగలరని రాజాపేట మండలం రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్‌ఎస్) విద్యార్థులు మరోసారి నిరూపించారు. ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) ప్రవేశాల్లో ఈ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సీట్లు సాధించి అరుదైన గుర్తింపు తెచ్చారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ టాపర్లను ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) మనోజ్ శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందించారు.

**అంకితభావంతోనే ఉత్తమ ఫలితాలు:**

ఈ సందర్భంగా హెచ్‌ఎం మనోజ్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ఉపాధ్యాయుల సరైన మార్గదర్శకత్వం ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారనడానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. విద్యార్థుల కోసం ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అదనపు తరగతులు నిర్వహించిందని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి సందేహాలను నివృత్తి చేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు.

**విశ్వాసానికి ప్రతీక:**

ఒకప్పుడు ప్రభుత్వ బడుల పట్ల ఉన్న నిర్లక్ష్య భావన నేడు పూర్తిగా మారిపోయిందని, మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన బోధనతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఒకే పాఠశాల నుండి ఐదుగురు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. పిల్లల చదువులకై నిరంతరం శ్రద్ధ వహించిన తల్లిదండ్రుల సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుడు కూతురు లింగంకు ఘన సన్మానం

- తెలంగాణ అవతరణ వేడుకల్లో సత్కరించిన మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్
- ఉద్యమ సేవలు చిరస్మరణీయం: నేతల కొనియాడలు

**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన రాజాపేట మండల కేంద్రానికి చెందిన ఉద్యమకారుడు, మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కూతురు లింగంకు ఘన సన్మానం జరిగింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ ఆయనను శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం నాటి ఉద్యమంలో కూతురు లింగం చేసిన సేవలు, పోరాటాలు అభినందనీయమన్నారు. ఉద్యమకారులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్‌రామ్‌రెడ్డి, మేక వెంకటేశ్వర్‌రెడ్డి, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్ పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బెడిద వీరేశం, రామిండ్ల నరేందర్, డీలర్ పోచయ్య, ములుగు సోమలింగం, గుర్రం నర్సింలు, పల్లె సంతోష్ గౌడ్, చామకూర గోపాల్, దగ్గుల విష్ణు, బిక్షపతి, చెల్మిడి వెంకటేష్, మర్ల నాగరాజు, బాలకృష్ణ, చంద్రయ్య తదితరులు ఉద్యమకారుడిని అభినందించారు.

# బీఆర్ఎస్ నేత అంకతి సుదర్శన్ ఆకస్మిక మృతి

- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు.. కదిలివచ్చిన జనం



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో విషాదం నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ నమ్మకమైన సీనియర్ నాయకుడు అంకతి సుదర్శన్ ఆకస్మిక మరణం చెందారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఆయన, హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం కన్నుమూశారు. సుదర్శన్ మరణవార్త వినగానే రాజాపేట గులాబీ శ్రేణులు దిగ్భ్రాంతికి లోనయ్యాయి. సుదర్శన్ మృతదేహాన్ని చూడగానే కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు తరలివచ్చి సుదర్శన్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన మృదుస్వభావి అయిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం వేలాది మంది జనం నడుమ అశ్రు నయనాల మధ్య రాజాపేట స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి.

# బొందుగుల గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ
- ఎమ్మెల్యేకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేసిన సర్పంచ్ ఎల్లయ్య
- పుష్పగుచ్ఛాలకు బదులు విద్యార్థులకు ఉపయోగపడేవి ఇవ్వాలని విప్ పిలుపు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బొందుగుల గ్రామ సర్వతోముఖాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. బుధవారం యాదగిరిగుట్టలోని ఎమ్మెల్యే స్వగృహంలో బొందుగుల గ్రామ సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను సర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్.. గ్రామాభివృద్ధికి అవసరమైన పనుల ప్రతిపాదనలను (ప్రపోజల్స్) వెంటనే సిద్ధం చేసి తన కార్యాలయానికి అందజేయాలని సూచించారు. నిధుల హామీపై సర్పంచ్ ఎల్లయ్య విప్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**శాలువాలు వద్దు.. పుస్తకాలే ముద్దు:**

త్వరలో జరగనున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు, పుష్పగుచ్ఛాలకు బదులుగా పేద విద్యార్థులకు పంపిణీ చేసేందుకు వీలుగా నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. దీనిపై ప్రభుత్వ విప్ ఐలయ్య హర్షం వ్యక్తం చేస్తూ.. తన పుట్టినరోజు వేడుకల సందర్భంగా అనవసర ఖర్చులతో కూడిన శాలువాలు, బొకేలు తీసుకురావద్దని, వాటికి బదులు ప్రభుత్వ బడి పిల్లలకు ఉపయోగపడే నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తే వాటిని స్వయంగా పేద విద్యార్థులకు పంపిణీ చేస్తానని పిలుపునిచ్చారు.



# నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

- ఏఐఎస్ఎఫ్, విజెఎస్ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర
- తహసిల్దార్ కార్యాలయం ముట్టడి.. వినతిపత్రం అందజేత
- మూడు జిల్లాల అనుసంధాన రహదారిపై ప్రజాసంఘాల ఆగ్రహం






**తొలివెలుగు, అడ్డగూడూరు:** మండల పరిధిలోని గురజాల నుండి జానకిపురం వరకు శంకుస్థాపనకే పరిమితమై నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన జ్వాలలు ఎగిశాయి. ఏఐఎస్ఎఫ్, విజెఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మానాయికుంట చౌరస్తా (ఎక్స్ రోడ్) నుండి అడ్డగూడూరు తహసిల్దార్ కార్యాలయం వరకు స్థానిక ప్రజలతో కలిసి భారీ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ శేషగిరిరావును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

**ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తగదు:**

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ.. గురజాల-జానకిపురం రహదారి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మే 20వ తేదీన మానాయికుంట ఎక్స్ రోడ్‌లో ధర్నా చేసినప్పటికీ స్థానిక తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామేల్ స్పందించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. మూడు జిల్లాలను అనుసంధానం చేసే ఈ కీలకమైన రహదారి నిలిచిపోవడంతో నిత్యం వేలాది మంది ప్రజలు, వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలంలో ఈ రోడ్డు మరింత అధ్వాన్నంగా తయారై రైతులు, కూలీలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చొరవ తీసుకుని రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) మంత్రి సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.

# హరిత సంకల్పం.. జలాల్‌పూర్ అర్బన్ పార్క్‌లో ప్లాంటేషన్ డ్రైవ్

- 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పర్యావరణ వేడుక
- మొక్కలు నాటి, ఉచితంగా పంపిణీ చేసిన సర్పంచ్, అటవీ అధికారులు
- పచ్చదనంపై గ్రామ వీధుల్లో ఘనంగా అవగాహన ర్యాలీ
- గ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భవిష్యత్తు తరాలకు పచ్చని, స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' ప్రత్యేక డ్రైవ్ భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామ పరిధిలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. జూన్ 1 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పర్యావరణ డ్రైవ్‌లో భాగంగా చౌటుప్పల్ అటవీ క్షేత్రాధికారి (ఎఫ్ఆర్ఓ) జి. సత్యనారాయణ ఆధ్వర్యంలో జలాల్‌పూర్ అర్బన్ పార్క్‌లో భారీ ప్లాంటేషన్ (మొక్కలు నాటే) కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జలాల్‌పూర్ సర్పంచ్ శాపాక లింగస్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు.

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత:**

ఈ సందర్భంగా సర్పంచ్ శాపాక లింగస్వామి, ఎఫ్ఆర్ఓ సత్యనారాయణతో కలిసి అర్బన్ పార్క్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంచడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ నివాసాల వద్ద మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు,





మహిళలకు ఉచితంగా వివిధ రకాల నీడను, ఫలాలను ఇచ్చే మొక్కలను పంపిణీ చేశారు. ప్రజల్లో పర్యావరణంపై చైతన్యం తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి జలాల్‌పూర్ వీధుల్లో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జలాల్‌పూర్ సర్పంచ్ శాపాక లింగస్వామి, ఉపసర్పంచ్ కేసారం మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ పర్నే మల్లారెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# బడి తెరిచేనాటికి పనులు పూర్తి కావాలి

- లోతుకుంట కేజీబీవీని తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- నిర్ణీత గడువులోగా మౌలిక వసతుల అభివృద్ధి పనులు ముగించాలి
- నాణ్యతలో లోపాలు ఉంటే కఠిన చర్యలు తప్పవు




**తొలివెలుగు, వలిగొండ:** ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం వలిగొండ మండల పరిధిలోని లోతుకుంట గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆయన రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలో నూతనంగా చేపడుతున్న వివిధ నిర్మాణ, మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**అనుకూల వాతావరణం కల్పించాలి:**

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కేజీబీవీలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. తరగతి గదుల ఆధునీకరణ, వసతి గృహాలు (డార్మిటరీలు), రక్షిత తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్ల సౌకర్యం తదితర అంశాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలని, జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రశాంతమైన, అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బిక్షపతి, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొలనుపాకలో 'నల్ల'ధన దాహం..

# చెరువు మట్టి గుల్ల!

- సాధారణ మట్టి పర్మిట్‌తో చెరువు నల్లమట్టి దోపిడీ
- రాజపేట రోడ్లపై రాత్రింబవళ్లు లారీల మోత.. గనుల శాఖ తీరుపై అనుమానాలు
- నిత్యం వందల ట్రిప్పులు..ధ్వంసమవుతున్న రోడ్లు
- అతివేగంతో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- ప్రశ్నిస్తే కాంట్రాక్టర్ బెదిరింపులు.. నిమ్మకు నీరెత్తిన అధికారులు!




**తొలివెలుగు, రాజపేట/ యాదాద్రిభువనగిరి:** గనులు, భూగర్భ శాఖ జారీ చేసిన సాధారణ మట్టి (ఆర్డినరీ ఎర్త్) అనుమతులను అడ్డం పెట్టుకుని విలువైన చెరువు నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు రాజపేట ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆలేరు మండలం కొలనుపాక గ్రామ పరిధిలో జరుగుతున్న ఈ తవ్వకాలపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార అనుమతులు సాధారణ మట్టికి మాత్రమే ఉండగా, క్షేత్రస్థాయిలో మాత్రం చెరువుల నుంచి నల్లమట్టి తరలిస్తూ 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా దందా సాగిస్తున్నారు.

**పర్మిట్ ఒకటీ.. తరలింపు మరోటీ!**

ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని సర్వే నంబర్లు 2000, 2000/ఈఈ, 2000/ఎ1/1, 2000ఎఎ1/1ల పరిధిలో మూడు హెక్టార్ల విస్తీర్ణంలో సాధారణ మట్టిని తరలించేందుకు గనుల శాఖ తాత్కాలిక అనుమతి (టీపీ) జారీ చేసింది. మే 20 నుంచి జూన్ 9 వరకు 5,000 మెట్రిక్ టన్నుల సాధారణ మట్టిని మాత్రమే తరలించుకోవాలని అనుమతుల్లో స్పష్టంగా పేర్కొంది. అయితే అనుమతి సాధారణ మట్టికి ఉన్నప్పటికీ, వాస్తవంగా చెరువుల్లోని నల్లమట్టిని భారీ యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**చెరువు మట్టిపై కన్నేసిన కాంట్రాక్టర్లు..**

సాధారణ మట్టికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ (సెగ్నియోరేజ్ రుసుము) చాలా తక్కువగా ఉంటుంది. దీంతో కాంట్రాక్టర్లు తక్కువ ఖర్చుతో పర్మిట్లు సాధించి, మార్కెట్లో విపరీతమైన డిమాండ్, అధిక ధర పలికే చెరువు నల్లమట్టిని తరలిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండిపడటమే కాకుండా, పర్యావరణానికి, సహజ వనరులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాజపేట మీదుగా 24 గంటల లారీల హడావిడి**

కొలనుపాక నుంచి తరలిస్తున్న మట్టి లారీలన్నీ రాజపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా 24 గంటల పాటు వందలాది ట్రిప్పులు తిరుగుతుండటంతో గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. లారీల మితిమీరిన వేగం కారణంగా నిత్యం ప్రమాదాల ముప్పు పొంచి ఉందని, రోడ్ల వెంట రేగుతున్న దుమ్ము కాలుష్యంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.

**ప్రశ్నిస్తే బెదిరింపులా?**


ఈ అక్రమ రవాణా, నిబంధనల ఉల్లంఘనపై ప్రశ్నించిన స్థానిక యువకులు, గ్రామస్తులకు సదరు కాంట్రాక్టర్ నుంచి తీవ్ర బెదిరింపులు ఎదురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "నాకు పైస్థాయి అధికారుల అండదండలు ఉన్నాయి.. ఎవరూ ఏమీ చేయలేరు" అనే అహంకార ధోరణితో కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో అటు అధికారుల తీరుపై, ఇటు కాంట్రాక్టర్ అరాచకంపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

**గనుల శాఖ పర్యవేక్షణ ఎక్కడ?**

పర్మిట్ నిబంధనల ప్రకారం.. తవ్వకాల ప్రాంతం, తీస్తున్న మట్టి రకం, రవాణా పరిమితులపై గనుల శాఖ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే కొలనుపాకలో కళ్లెదుటే ఇంత పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతున్నా, మైనింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సహాయ సంచాలకుల (ఏడీ) స్థాయి అధికారులు అసలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? లేక ఏసీ గదులకే పరిమితమయ్యారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి:**

సాధారణ మట్టి పేరుతో నల్లమట్టి అక్రమ రవాణా జరుగుతుందన్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని మైనింగ్ చట్టాల ప్రకారం రికవరీ చేయాలని కోరుతున్నారు. అక్రమ తవ్వకాలతో చెరువుల భవిష్యత్తుకు ముప్పు వాటిల్లకుండా తక్షణమే ఈ దందాను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.






# శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివార్ల కళ్యాణోత్సవ కరపత్రిక ఆవిష్కరణ

- 6 నుంచి 8 వరకు మల్లికార్జున, లక్ష్మీనరసింహ స్వామివార్ల బ్రహ్మోత్సవాలు
- అగ్నిగుండాలు, ఒగ్గు కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ
- దోతిగూడెంలో వైభవంగా ఉత్సవాల ఏర్పాట్లు
- హాజరైన సర్పంచ్ యాట జంగయ్య, కమిటీ నేతలు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివార్ల వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఈనెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రికలను బుధవారం గ్రామ సర్పంచ్ యాట జంగయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు పగిళ్ల సుధాకర్ రెడ్డి కలసి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు.

**మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక వేడుకలు:**

ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు పగిళ్ల సుధాకర్ రెడ్డి బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. జూన్ 6వ తేదీ శనివారం ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, స్వస్తి వచనం, ఆంజనేయ స్వామి అభిషేకం, నవగ్రహ పూజ, లక్ష్మీ నరసింహ హోమం నిర్వహిస్తారు. అనంతరం లక్ష్మీ నరసింహ స్వామివారి కళ్యాణ మహోత్సవం, పుట్ట బంగారం తీసుకురావడం, ఊర బోనాల సమర్పణ, గంగా స్నానం (జల్ది), ఒగ్గు కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. జూన్ 7వ తేదీ ఆదివారం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివార్ల కళ్యాణ మహోత్సవం, వీర బోనం, అగ్నిగుండాల ప్రవేశం, మహిళలచే బోనాల సమర్పణ, ఒగ్గు కథా ప్రదర్శనలు వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు. చివరి రోజు జూన్ 8వ తేదీ సోమవారం ఒగ్గు కళాకారులచే శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి వేషధారణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పగిళ్ల రామ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రావుల శ్రీదేవి శేఖర్ రెడ్డి, ఆలయ ఉపాధ్యక్షుడు బాల మల్లేశం, ప్రధాన కార్యదర్శి ప్రసాదం విష్ణు, ముఖ్య నాయకులు ముద్దం సత్యం, చొప్పరి పాండు, మందడి మహేందర్ రెడ్డి, మందడి జంగారెడ్డి, ముద్దం శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## అంతమ్మగూడెంకు కాలుష్య విముక్తి కల్పించాలి

- కెమికల్ పరిశ్రమల వ్యర్థాలతో కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- విష వాయువులతో శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయని గ్రామస్థుల ఆవేదన
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేసిన కాలుష్య విముక్తి పోరాట సమితి
- సీఎం, పర్యావరణ శాఖ మంత్రి దృష్టికి సమస్య తీసుకెళ్తానన్న స్పీకర్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని అంతమ్మగూడెం గ్రామాన్ని రసాయన (కెమికల్) కాలుష్య కోరల నుండి రక్షించి, గ్రామస్థులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అంతమ్మగూడెం కాలుష్య విముక్తి పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోరాట సమితి ప్రతినిధులు గ్రామంలో నెలకొన్న కాలుష్య తీవ్రతను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు.

**కలుషితమైన భూగర్భ జలాలు:**

గ్రామ పరిసరాల్లోని కెమికల్ పరిశ్రమల నుండి వెలువడుతున్న వ్యర్థ రసాయనాల కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని, తాగడానికి నీరు లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పరిశ్రమలు వదులుతున్న విష వాయువుల వల్ల గాలి సైతం కలుషితమై శ్వాసకోస సమస్యలు తలెత్తుతున్నాయని విన్నవించారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట సమితి నాయకులు దామోదర్ రెడ్డి, బాల్ రెడ్డి, రామ్ రెడ్డి, మహేష్, నరసింహ, ధనలక్ష్మి, రేణుక, శారద, అలివేలు, ముత్తమ్మ పాల్గొన్నారు.

## పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా రామిడి యాదిరెడ్డి

- జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆదేశాలతో నియామకం
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: యాదిరెడ్డి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పురపాలక కేంద్రం (మున్సిపాలిటీ) భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన పట్టణ ప్రధాన కార్యదర్శిగా రామిడి యాదిరెడ్డి నియమితులయ్యారు. బుధవారం పట్టణ కేంద్రంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు డబ్బికార్ సహేష్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ ఆదేశాల మేరకు నూతన ప్రధాన కార్యదర్శిగా యాదిరెడ్డిని ప్రకటిస్తూ, ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు.

**బాధ్యతాయుతంగా పనిచేస్తా:**

నియామక పత్రం అందుకున్న అనంతరం రామిడి యాదిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సహేష్, ఇతర జాతీయ, రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, కిసాన్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సురకంటి రంగారెడ్డి, జిల్లా చేనేత సెల్ కన్వీనర్ గంజి బసవలింగం, మాజీ సర్పంచ్ నోముల గణేష్, సీత చక్రపాణి, తండ రమేష్, ఏలే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మండలంలో నేటి నుంచి 'ప్రజా పాలన' గ్రామ సభలు

- జూన్ 4, 6, 8, 10 తేదీల్లో నిర్వహణ
- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఎంపీడీఓ పిలుపు

**చౌటుప్పల్, జూన్ 3 (తొలివెలుగు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన -- ప్రజా దర్బార్' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చౌటుప్పల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించనున్నట్లు మండల పరిషత్తు అభివృద్ధి అధికారి పి. విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జూన్4, 6,8,10 తేదీల్లో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అధికారికంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామస్థుల సమస్యలు, అవసరాలను తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సభల నిర్వహణకు ముందు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని ఎంపీడీఓ సూచించారు. చాటింపు, మైక్ ప్రకటనలు, ఇతర సమాచార మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తు సమాచారం అందించి అధిక సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలను విజయవంతం చేయాలని సూచించారు. అలాగే మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామ సభలకు హాజరై ప్రభుత్వ పథకాలు, ప్రజా దర్బార్ కార్యక్రమాల లక్ష్యాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టేలా సమావేశాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హెచ్చరించారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.



## ఘనంగా గడ్డం యాదగిరి జన్మదిన వేడుకలు

- శాలువాతో సత్కరించిన ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న
- ఉపకులాల హక్కుల కోసం యాదగిరి కృషి అభినందనీయం

**తొలివెలుగు, రామన్నపేట:** తెలంగాణ ఉద్యమకారుడు, టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరి 53వ జన్మదిన వేడుకలు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న హాజరై, గడ్డం యాదగిరిని శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా జోగు అంజన్న మాట్లాడుతూ.. చిందు సామాజిక వర్గానికి చెందిన గడ్డం యాదగిరి ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కేవలం ఉద్యమమే కాకుండా, సమాజంలో వెనుకబడిన 57 ఎస్సీ ఉపకులాల హక్కుల సాధన కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటాలు చేయడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. చిందు సామాజిక వర్గానికి చెందిన యాదగిరికి సరైన గుర్తింపునిస్తూ, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా నియమించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు, 57 ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పోతరాజు శంకరయ్య, ఎస్.కే. చాంద్, నోముల శంకర్, కొండ మల్లేష్, బొడ్డు లింగయ్య, కైరంకొండ సంతోష్, ఏలూరి రవి, ఎర్ర రమేష్ గౌడ్, కూనూరు శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల కార్యదర్శిగా గూని సురేష్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న జాతీయ కార్యవర్గం
- కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తానని వెల్లడి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి గ్రామానికి చెందిన గూని సురేష్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడంలో భాగంగానే ఈ నియామకం చేపట్టినట్లు జాతీయ చైర్మన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నియామక పత్రాన్ని అందుకున్న అనంతరం గూని సురేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన జాతీయ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం యొక్క నియమ నిబంధనలను (బై-లాస్) పూర్తిగా అనుసరిస్తూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి, వారి న్యాయమైన హక్కుల సాధనకు నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఈ నియామకం రెండేళ్ల పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అమలులో ఉంటుందని సంఘం ప్రతినిధులు వెల్లడించారు. సురేష్ నియామకం పట్ల మండలంలోని పలువురు కార్మిక సంఘాల నేతలు, భీమనపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా హరీష్‌రావు జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- పార్టీ మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ

**తొలివెలుగు, చౌటుప్పల్:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సీనియర్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బుధవారం చౌటుప్పల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ, అహర్నిశలు శ్రమించే అరుదైన నాయకుడు హరీష్ రావు అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలోనూ, స్వరాష్ట్ర పునర్నిర్మాణంలోనూ ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి, తెలంగాణ రాష్ట్ర కీర్తిని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు తాడూరు పరమేష్, సతీష్, తూర్పునూర్ మల్లేష్ గౌడ్, కానుగు శివ, బండ్ల శ్రీకాంత్, అమీర్, మున్నా, సంగిశెట్టి శివ, అతు ఈశ్వర్, విజయ్, గంగాదేవి రమేష్, గంగాదేవి శివ, చీమకండ్ల కృష్ణయ్య, నరేంద్ర, సాగర్, రమణ, గోవి రఘు, పిల్లలమర్రి సాయి, గుండెబోయిన వెంకటేశం, కోయిలగూడెం వెంకటేశం, ముసిర్ ఒమేర్, కళ్లెట్ల నాగరాజు, రెడ్డగోని మల్లేశం, ఊదని రాకేష్ తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# రామన్నపేట - వేములకొండ నూతన బస్సు సర్వీసు ప్రారంభం

- పచ్చ జెండా ఊపిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం
- గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం
- ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



**తొలివెలుగు, రామన్నపేట:** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో రామన్నపేట నుండి వేములకొండ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన కొబ్బరికాయ కొట్టి, పచ్చజెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. అనంతరం బస్సులో కొద్దిదూరం ప్రయాణించి ప్రయాణికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. రామన్నపేట మండల కేంద్రం నుండి బయలుదేరే ఈ బస్సు నీర్నెముల, లక్ష్మాపురం, శోభనాద్రిపురం, కొత్తగూడెం మీదుగా వేములకొండ వరకు నడుస్తుందన్నారు. ఈ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు ఈ నూతన బస్సు సౌకర్యం ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల రవాణా అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలందరూ ఈ ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ (ఆర్ఎమ్) జాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు గంగుల వెంకట రాజారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటె రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ జమిరుద్దీన్, నాయకులు శంబాల వెంకటేష్, సాల్వేరు అశోక్, గుత్తా నరసింహారెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి, వనం చంద్రశేఖర్, ఎండి అక్రమ్, మాదూరి జ్యోతి రామచంద్రరావు, బత్తుల కృష్ణ గౌడ్, కందిమల్ల గోపాల్ రెడ్డి, పైల వెంకటరెడ్డి, పెద్దగోని వెంకటేశం, మునిపంపుల మాజీ సర్పంచ్ యాదాసు కవిత యాదయ్య, కొమ్ము శేఖర్, గోరిగే శేఖర్, నోముల ప్రవీణ్ కుమార్, అశోక్, ఎండి నాసర్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిబంధనలకు విరుద్ధంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న ఒక మాజీ సైనిక ఉద్యోగిని సికింద్రాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.లక్షల విలువైన మధ్యప్రదేశ్‌కు చెందిన 51డిఫెన్స్ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే....సికింద్రాబాద్‌కు చెందిన మాజీ సైనిక ఉద్యోగి కె. విద్యాసాగర్ రెడ్డి గత కొన్ని రోజులుగా డిఫెన్స్ మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం పక్కా ప్రణాళికతో సికింద్రాబాద్‌లోని సట?టైల్ యేనియన్ షాపింగ్‌మాల్ సమీపంలో డిఫెన్స్ మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న మాజీ సైనిక ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అతడి వద్ద నుంచి 11మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడి ఇంటిపై దాడులు జరిపి తనిఖీ చేయగా మరో 40 డిఫెన్స్ మద్యం బాటిళ్లు లభించాయి. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి మొత్తం రూ.లక్ష విలువైన 51 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్లలో 28 టీచర్స్, 18 సీగ్రమ్ సాచ్ బాటిళ్లు, మూడు సిగ్నేచర్, వైన్ బాటిళ్లు ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

### మత్తు కోసం వినియోగిస్తున్న దగ్గు మందు సీజ్

రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు చింతల్‌లోని భగత్‌సింగ్ నగర్‌లో జకుల సాకేత్ అనే వ్యక్తి నిషేదిత దగ్గు మందు సీసాలను అమ్ముతుండగా పట్టుకున్నారు. ఈ నిషేదిత దగ్గు మందు బాటిళ్లు ఎకడి నుంచి వచ్చాయని నిందితుడిని ప్రశ్నించగా తులసి మెడికల్ షాపు యజమాని గుండ్ల చంద్రశేఖర్ ఇచ్చాడని తెలిపాడు. నిందితుడి సమాచారంతో గుండ్ల చంద్రశేఖర్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 10 నిషేధిత దగ్గు మందు బాటిళ్లు లభ్యమయ్యాయి. నిందితులిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 15 నిషేధిత దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును కుత్భుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

## న్యాయవాది హత్య కేసులో నిందితుడిని అప్పగించాలి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 3 (నమస్తే తెలంగాణ): మాసబ్‌ట్యాంక్ పరిధిలో జరిగిన ప్రముఖ న్యాయవాది ఖాజా మెయిజుద్దీన్ హత్య కేసులో ప్రధాన నిందితుడు టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ముజాహిద్ ఆలం ఖాన్‌ను పోలీసు కస్టడీకి అప్పగించాలని బుధవారం పోలీసులు పిటీషన్ దాఖలు చేశారు. నాంపల్లి పోలీస్ స్టేషన్ విచారణాధికారి సైదులు నేతృత్వంలో సమాచారం సేకరించేందుకు 10 రోజుల పాటు పోలీసు కస్టడీకి కోరుతూ 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టుకు పిటీషన్‌ను సమర్పించారు. మే 24న ఉదయం న్యాయవాది తన ఇంటినుంచి బయటకు వ చ్చి కారు ఎక్కుతుండగా నిందితులు స్కార్పియో వాహనంతో బలంగా ఢీకొట్టి కొద్ది దూరం ఈడ్చుకెళ్లారు పోలీసులు ప్రాథమికంగా హిట్ అండ్ రన్ కింద కేసును భావించిన అనంతరం సీసీటీవీ ఫూటేజ్, సాంకేతిక ఆధారాల ఆధారంగా ఇది ప్రమాదం కాదని, పక్కాగా ప్లాన్ ప్రకారం హత్య అని పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. ముజాహిద్ తండ్రి మహబూబ్ ఆలం ఖాన్‌తో కలిసి ప్రణాళిక రచించారని, వీరిద్దరినీ సూత్రధారులుగా పరిగణిస్తూ రిమాండ్ రిపోర్టును రూపొందించారు. ముజాహిద్‌కు జైలులో పోలీసులు నోటీసులు జారీ చేసిన పిదప కస్టడీ పిటీషన్‌ను కోర్టు ఎదుట దాఖలు చేశారు.

